# మోసగాడు

వరి చేను కోత కొచ్చి వంగింది. గాలి తాకిడికి పైరు అలలు అలలుగా కదులుతున్నది. బంగారు పలకల్ని నిండుగా అతికించినట్టు ధాన్యం మెరుస్తుంది. ఒడ్డుమీద కూర్చుండి పంటపొలం వైపు పక్కనే ఉన్న బీడు భూమివైపు దిగులుగా చూస్తున్నాడు నర్సింలు. అతడి మనసు బాధతో మూల్గింది.

"నర్సన్నా! పొలం కోతకచ్చింది గదా! కొసికుప్పవేయించు బంగారమటువంటి పొలంను అమ్ముకుంటివి. నీపొలం నీకుంటే ఎంత బాగుండు. దురాశకుపోయి దుఖాన్ని తెచ్చుకుంటివి. వాడు పాలుకు ఇయ్యిమన్నా ఇయ్యకుండా బీడు పెట్టుకునె. ఇక్కడ కోళ్ళఫారం కడుతడట. అది కట్టినంక ఈ అద్దెకురంపొలంకూడా పనికి రాకుండా పోతది." అటువైపు వచ్చిన సత్తయ్య అన్నాడు.

నర్సింలు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నాడు. "వాని మాయ మాటలు నమ్మిన సత్తన్నా. దగ్గరోడేగదా. ఇంతమోసం చేస్తాడా అనుకున్నా. గొంతుకోసే దాకా తెలువలేదు. వానికి ఇచ్చిన పైసలేకాక నాలుగుసార్లు బొంబాయి పోయి వచ్చుడుకు, రెండు నెలలు అక్కడ ఉండుడుకు పదివెయిల దాకా ఖర్చయినయి. అట్ల ఆగమాగం తిరుగుట్లనే ఉన్న అద్దెకరం చేనునైనా యాల్లకు నాటువేసుకోకపోతివి. అందరి కోతలు పూర్తయిపాయె. నాది ఇప్పుడే కోతకు వచ్చె. ఇట్ల చేస్తడనుకోలేదు."

"అవుగని నీకీ విషయం తెలుసా! నిన్ను ఒక్కన్నేగాదు. మన ఊర్లె చాలా మందిని మోసం జేసిండువాడు. అందరు కలిసి వాని అడ్రస్ దొరికిచ్చుకున్నరు. బొంబాయిల ఉన్నడంటే అక్కడికి పోయింద్రు. ఇయ్యాల్లనో రేపో ఏదో విషయం తెలుస్తది." అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు సత్తయ్య.

దిగులుగా ఇంటిమొహం పట్టాడు సత్తయ్య. సత్తయ్య రెండెకరాల రైతు. కూడుకుగుడ్డకు కరువు లేకుండా బతికేవాడు. భార్య లక్ష్మి మాత్రం ఎప్పుడూ అసంతృప్తిగా ఉండేది. కూతురు పెళ్ళికి వచ్చిందని. ఏంపెట్టి పెళ్ళి చేసేదని దిగులు పడుతూ ఉండేది. రెక్కలిరుగ కష్టం చేసినా బట్టకు పొట్టకే సరిపోతున్నాయని రోజూ విసుక్కునేది.

ఏజంట్ రాజు ఆఊరివాడే. నర్సింలుకు వరుసకు తమ్ముడౌతాడు. మస్కట్‌తోలిస్తా పాస్‌పోర్ట్‌లు ఇయ్యండి అని అందరినీ అడిగేవాడు. అతడి మాటల్ని ఎవరూ నమ్మలేదు. ఒకరిద్దరిని తోలాక, వాళ్ళు లెటర్లు వేసాక రాజు ఇంటిముందు జనం క్యూకట్టారు. పాస్‌పోర్ట్‌లు లేనివారు కొత్తగా తీసారు. ఇది గమనించి రాజు రేటును పెంచాడు. అయినా ఎవరూ వెనక్కిరాలేదు.

భర్తను బలవంతం చేసి పాస్‌పోర్ట్ తీయించింది లక్ష్మి. నర్సింలుకు ఇష్టంలేదు. ఉన్నఊర్లో ఏదో చేసుకుని బతక్క దేశాలు బతకపోవుడెందుకనుకున్నాడు. కాలం మంచిగై వానలు కొడితే తనే నలుగురు కూలీలకు పని చెప్పగలడు. అంతదూరం అంతడబ్బుపెట్టి వెళ్ళడం ఎందుకను కుంటున్నాడు. అదే విషయం లక్ష్మితో చెబితే చేతకాని తనమని దూషించింది.

"మన కండ్ల ముంగటి పోరగాండ్లు మస్కట్‌పోయి లక్షలు సంపాయిస్తుండ్రు. గొర్రెతోక బెత్తెడన్నట్టు ఎన్నిరోజులు ఎవుసం జేసినా ఇంతే! చావము బతకము. తెగాయించి నాలుగేండ్లు పోయివత్తె పొల్లలగ్గం చెయ్యచ్చు. సుతారి లింగం జూడు మస్కట్ పోయచ్చి బంగ్ల కట్టిండు. కుమ్మరి శంకరి ఇద్దరు చెల్లెండ్ల లగ్గం జేసిండు. ఈ పంట లమ్మి లగ్గం జెయ్యాలంటే ఇంక పదేండ్లయినా లక్షరూపాయలు కూడబెట్టం" హితవు చెప్పింది లక్ష్మి.

అయిష్టంగానే తలూపాడు నర్సింలు. రెండు నెలల్లో పాస్ పోర్ట్ చేతికి వచ్చింది. రాజుకు పదివేల అడ్వాన్స్ ఇచ్చాడు. రెండు నెలలు తిరక్కుండానే విజా వచ్చిందని చెప్పాడు రాజు. అప్పుచేసి అరవై వేయిలుతెచ్చి రాజుకు ఇచ్చాడు. రాజు తప్పకుండా మస్కట్ తోలిస్తాడనే నమ్మకమే అడగగానే అప్పును పుట్టసిచ్చింది. నర్సింలు మరో ఇద్దరిని వెంటబెట్టుకుని బొంబాయి వెళ్ళాడు రాజు.

విజా రావడం అబద్దమని అక్కడికి వెళ్ళాక తెలిసిపోయింది. ముగ్గురినీ ఒక రూంలో ఉంచి మళ్ళీ వస్తానని ఎక్కడికో వెళ్ళిపోయాడు రాజు. వారం రోజులవరకూ కనిపించలేదు. నెలరోజులు లేటుందని అందరినీ ఊరికి తీసుకొచ్చాడు. అలా నాలుగు సార్లు బొంబాయి చుట్టు తింపి హఠాత్తుగా మాయమైపోయాడు రాజు. వడ్డీకి వడ్డీ పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోయాడు నర్సింలు. ఎకరంనర పొలం అమ్మకతప్పింది కాదు. ఇప్పుడు అర ఎకరం మాత్రమే మిగిలింది. పొలం కొన్న వ్యక్తి కరీంనగర్‌లో ఉంటాడు. ముందుగా నర్సింలుకే కౌలుకు ఇస్తానన్నాడు. పొలం ఊరు అంచుననే ఉంది కాబట్టి ప్లాట్లు పెట్టాలన్న ఆలోచనవచ్చి బీడుంచాడు. అతడు ఆ నిర్ణయం తీసుకున్న నుండి నిద్రపట్టడంలేదు నర్సింలుకు. రకరకాల అనుమానాలు మొదలయ్యాయి. ఉన్న అర్దెకరం కూడా సాగుకాకుండా బీడువడిపోయినట్టు కలలు రావడం మొదలెట్టాయి. ఇంట్లోకి అడుగుపెట్టగానే లక్ష్మి ఎదురొచ్చింది. ఆమె మొహం సంతోషంతో వెలిగిపోతున్నది. కారణమేమిటని అడిగాడు నర్సింలు.

"మంచివారికెన్నడూ చెడు జరగదు. ఫైనాన్స్ రాజు వచ్చాడు. ఈరోజు సాయంత్రం డబ్బు ఇస్తానన్నాడు. అసలు వడ్డీ కలిపి ఇవ్వుమన్నాను. తనను బొంబాయి ఏజంట్ మోసం చేసాడని అతడింతవరకూ కనిపించలేదని చెప్పాడు. ఈ డబ్బు తాను చేతినుంచే ఇస్తున్నానని బతిమాలాడు. జాలితలిచి సరేనన్నాను." నవ్వుతూ చెప్పింది లక్ష్మి. వచ్చేడబ్బును ఏం చేయాలో అప్పుడే నిర్ణయించు కుంది. భర్తతో ఆవిషయం కూడా చెప్పింది.

"పొలం అమ్మి తెర్లయిపోయాము. చేతులనిండా పనిలేక మనసున పడుతలేదు. దానికితోడు కొంత అప్పు తెచ్చి మనపొలం మనం కొనుక్కుందాం. రెండు పసల్లు ఎవలదన్నా కౌలుకు పట్టుకొని దున్ని బాకీ తేర్చుకుందాం. కన్నతల్లసుంటి చేను అమ్ముకొని తిండి కరువు దెచ్చుకుంటిమి."

భార్యవైపు నమ్మలేనట్టు చూసాడు నర్సింలు. రాజు ఇంటికి వచ్చి డబ్బు ఇస్తానని చెప్పడం నమ్మలేకపోతున్నాడు. ఇచ్చేవాడైతే ఇన్ని రోజులు ఊరువిడిచి ఎందుకు తిరుగుతాడు అనుకున్నాడు.

"రాజు రావడమేమిటే లక్ష్మి. మన ఒక్కరికే కాదు. ఊరిలో చాలామందికి డబ్బు ఇవ్వాలె. అంత డబ్బు ఎక్కడినుండి తెచ్చాడు. నాకు అనుమానంగానే ఉంది." నులకమంచం వాల్చి కూర్చుంటూ అన్నాడు నర్సింలు.

భర్త పక్కనే కూర్చుంటూ చెప్పింది లక్ష్మి. "మీ డబ్బులు ఇస్తాను రండీ అంటూ వాడు మన దగ్గరికి వస్తడా ఏంటీ...? మన ఊరినుండే కొంతమంది వెళ్ళి తీసుకొచ్చారట. డబ్బు ఇవ్వకపోతే

పోలీసులకు అప్పగిస్తామని చెప్పారట. ఈరోజు సాయంత్రం అందరికీ డబ్బు ఇస్తానన్నాడు. వచ్చేప్పుడు కొంత డబ్బు తెచ్చాడట. మరికొంత డబ్బుకొరకు పొలం అమ్మాడట."

నర్సింలుకు సంతోషం వేసింది. ఆనందంతో అతడి కళ్ళు మెరిసాయి. "మన డబ్బు మనకిస్తే పొలం కొందాం. మన పొలం మనం సాగు చేసుకుందాం. అప్పుడుచెబితే విన్నావుకాదు. ఏదో సంపాయిస్తమని చెప్పి ఉన్నది పోగొట్టుకుంటిమి. ఇకనైనా ఇటువంటి పని చెయ్యద్దు. బొంబాయి చుట్టూ తిరుగకపోతే ఉన్న చేనైనా యాల్లపొద్దున నాటేసుకుందుము. రేపే కోత పట్టాలె." చెప్పాడు భార్యతో.

"అన్నంతిని అలా బయటకు వెళ్ళు. రాజు ఎవరికైనా వడ్డీ ఇస్తున్నాడేమో కనుక్కో! రోజులు ఎలా ఉన్నాయి. బలమున్న వాడిదే రాజ్యం. ఎవరైనా బెదిరించి అడిగితే వడ్డీకూడా ఇస్తాడు. అలా ఇస్తున్నాడని తెలిస్తే మనం కూడా దబాయించి అడుగవచ్చు." హితబోధ చేస్తున్నట్టుగా చెప్పింది లక్ష్మి.

అన్నం తిని బయటపడ్డాడు నర్సింలు. ఎక్కడవిన్నా రాజు విషయమే మాట్లాడుకుంటున్నారు. నర్సింలుకు జాలి వేసింది. 'రాజు మాత్రం ఏం చేస్తాడు. ఒకరిద్దరిని పంపియ్యగానే ఇంటిముందు వరుసలు కట్టి బలవంతం చేసిరి. వీడు ఇచ్చిన ఏజంట్ ఎటు వంటివాడో! డబ్బు తీసుకుని పారిపోయాడట. వీడూ మాత్రం ఏం చేస్తాడు. అంతడబ్బు ఎక్కడినుండి తెస్తాడు. ఏదో ఇంత కమీషన్ వస్తదని ఆశపడ్డాడు పాపం' అనుకున్నాడు.

ఈ అభిప్రాయాన్నే ఒకరిద్దరి వద్ద బయట పెట్టాడుకూడా. వారు నర్సింలు వైపు అదోలా చూసి "ఇలా ప్రచారం చెయ్యమని చెప్పి వాడు నీకేమైనా ఇచ్చాడా" అన్నారు. వారు అలా అర్థం చేసుకుంటారని ఊహించని నర్సింలు మౌనంగా ఉండిపోయాడు.

అక్కడక్కడ తిరిగి ఇల్లు చేరుకున్నాడు నర్సింలు. ఇంట్లో అడుగుపెట్టగానే అడిగింది లక్ష్మి.

"బయట జనం ఏమంటున్నారు. అసలే ఇస్తున్నడటనా లేక వడ్డీకూడా ఇస్తున్నడటనా? ఏమని చెప్పాలో తెలియడం లేదు నర్సింలుకు. వాస్తవంగా అతడు ఆ విషయం గురించి ఎవరినీ అడుగలేదు. అసలు అడగాలనిపించలేదుకూడా. వాన్ని మరొకడు మోసం చేసాడు. వాడు మాత్రం ఏం చేస్తాడు అనిపించింది. పొలాన్ని అమ్మి బాకీ తీరుస్తున్నాడనగానే ఎందుకో నర్సింలు హృదయం ద్రవించింది. ఏం చెప్పకపోతే బాగుండదని అబద్ధం చెప్పాడు.

"అందరికీ అసలు మాత్రమే ఇస్తానన్నాడట. ఆ మాత్రమైనా వస్తుందని ఎవరూ ఏమనడం లేదు. అందరికీ సంతోషంగానే ఉంది."

ఆ మాటలకు లక్ష్మి మొహంలో తృప్తికనబడింది. తను ఫెయిల్ అయ్యానని తెలిసిన విద్యార్థికి పక్కింటి కుర్రాడు ఫెయిలయ్యాడని తెలిసినప్పుడు తృప్తిలాంటిదది. అది గమనించి మనసులోనే నవ్వుకున్నాడు నర్సింలు". రేపు కోత మొదలు పెడదాం. మనిద్దరి సోపతికి ఇంకొకరిని కూలికి పెట్టుకుందాం. ఇప్పటికే లేటుగచ్చింది. రాల్లొరప్పలో తెలువదు." అన్నాడు భార్యతో.

ఏదో చెప్పబోతూ ఆకాశంవైపు చూసి ఉల్కిపడింది లక్ష్మి. భయం పట్టుకుంది. "వామ్మో మొగులు ఎర్రసాలువడింది. పట్టపగలే మొగులయింది. ఈయేడు మామిడి చెట్లు విరగకాసినయి.

మామిండ్లు కాసినేడు రాళ్ళవాన ఉంటదంటరు. నాకేదో అనుమానంగా ఉంది.'' అంటూ బయటకు నడిచి ఆకాశంకేసి పరిశీలనగా చూసింది.

అంతవరకు నర్సింలుకూడా గమనించలేదు. ఆకాశం నిండా నల్లటిమేఘాలు. భయం భయంగా పైకి చూసాడు. భోరున వాన కురువడానికి సిద్ధంగా ఉంది ఆకాశం. అప్పుడే ఒక మెరుపు మెరిసింది. ఆ వెంటనే ఫెళఫెళమని ఉరుము. సన్నగా జల్లులు ప్రారంభమయ్యాయి. వాన చినుకులతో పాటు చిన్న చిన్న మంచుగడ్డలు పడ్డాయి. వాటిని చూడగానే నర్సింలు గుండె దడదడలాడింది. లక్ష్మి నీరసంగా కూలబడిపోయింది.

వారి ఆవేదనతో పనిలేకుండా మొదలయిన వడగళ్ళవాన ఉధృతమయింది. మొక్కజొన్న గింజల పరిమాణంలో మొదలయిన మంచురాళ్ళు గులకరాళ్ళ పరిమాణంలోకి మారాయి. మరికొద్ది సేపట్లో వాటి పరిమాణం మరింత పెద్దదయింది. ఉరుములు మెరుపులతో ఆకాశం దద్దరిల్లింది. వడగళ్లవాన మరింత ఉధృతమైంది. నేలమీద మంచుగడ్డలు అంగుళం కూడా ఖాళీ లేకుండా పేరుకుపోయాయి.

నర్సింలు గుండె చెరువయింది. లక్ష్మి బేలగా రోదిస్తుంటే ఓదారుస్తున్నాడు. కాని లోలోపల అతడికి కూడా దుఃఖం తన్నుకువస్తుంది. అయిపోయింది. అంతా అయిపోయింది. ఆకొద్దిపాటి పంటకూడా చేతికందకుండా పోయింది. మళ్ళీ తిండికి కరువు వచ్చింది. బతుకు మరింతగా దిగజారిపోయింది. ఎలా.....? నర్సింలు ఆక్రోశిస్తున్నాడు.

ఎడతెరిపిలేకుండా గంటవరకూ కురిసి ఆగిపోయింది వర్షం. ఆందోళనగా పొలం వద్దకు పరిగెత్తాడు నర్సింలు. అతడు ఊహించిన దానికంటే ఎక్కువగానే జరిగింది నష్టం. వడ్లు పూర్తిగా రాలిపోయాయి. గంట క్రితం బంగారు రంగుతో మెరిసి పోయిన పొలం యుద్ధభూమిలా మారిపోయింది. ప్రకృతి బీభత్సానికి ప్రత్యక్ష సాక్షులుగా రాలిపోయిన గింజలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. పైరు నేలమట్టమైపోయింది.

ఊహించని పరాణామానికి పిచ్చివాడిలా మారిపోయాడు నర్సింలు. కళ్ళవెంట నీరు కారుతున్నది. తిండిగింజలు కొనుక్కొనే పరిస్థితి ఎప్పుడూ రాలేదు. ఇంటినిండా దాన్యాన్ని చూసుకున్న రైతుకు తిండికే కొనుక్కొని తినడమంత గుండెకోత ఇంకోటి ఏముంటుంది. చేతికందిన పంట కళ్ళముందే కొట్టుకుపోతుంటే తట్టుకోలేకపోయాడు.

మనసు పూర్తిగా వికలమైపోయింది. చచ్చిపోవాలన్నంత విరక్తి కలిగింది. రాజు గుర్తుకొచ్చి ఆగిపోయాడు. తనడబ్బు తనకిచ్చినా కొంతైనా ఊరట కలుగుతుంది. తనకు తాను ధైర్యం తెచ్చుకుని ఇంటికి వచ్చాడు. భార్య బేలగా రోదిస్తూ కనిపించింది. జరిగిన నష్టం ముందుగానే అంచనా వేసుకున్నట్టుంది. పాడైపోయిన పైరును చూసే ధైర్యం చాలక పొలం వద్దకు వెళ్ళలేదు.

నర్సింలు కనబడగానే ఏదో ఆశతో అతడి మొహంలోకి చూసింది. సగం ధాన్యమైనా చేతికి రాకపోతుందా అన్నదే ఆమె ఆశ. అతడి మొహంలోని దైన్యతను చూశాక ఆశ చచ్చిపోయింది. మీదపడి బావురుమంది. కూతురు శాంత కూడా తల్లిదండ్రులనుచూసి ఏడ్వడం మొదలెట్టింది.

భార్యను ఓదారుస్తుండగా వీధిలో ఏదో కలకలం కనిపించింది నర్సింలుకు. ఏ రైతు పొట్టలోకి పురుగుమందు దిగిపోయిందో! పంట దిగుబడిని పెంచాలన్న ఆశతో పురుగు మందును కొన్నరైతు నష్టపోయామన్న నిరాశతో అదే పురుగుమందును ఆశ్రయిస్తున్నాడు. చంపడమే తెలిసిన దానికేం తెలుసు. ఎవరు చావాలో.....ఎవరు చావకూడదో! అనుకున్నారు.

వీధిలో కలకలం ఎక్కువయింది. ఎవరో అరుస్తున్నారు. బూతులు తిడుతున్నారు. పరుగులు తీస్తున్నారు. ఏమిటో చూద్దామని బయటకు వెళ్ళబోయిన నర్సింలు గుమ్మంముందు రాజు ప్రత్యక్షమయ్యేసరికి విస్తుపోయాడు. రాజు ఆయాసంతో రొప్పుతున్నాడు. ఒంటిమీద దెబ్బలు వాతదేలాయి. బట్టలు చిరిగిపోయి ఉన్నాయి. ఏం జరిగిందో కొద్దిగా అర్థమైంది నర్సింలుకు.

'పారిపోతున్నాడు పట్టుకోండి' ఎవరో అరుస్తున్నారు.

"వాన్ని నిలువునా నరికినా పాపం లేదు. మా సంసారాలన్నీ నాశనం చేసాడు" మరెవరో అంటున్నారు.

"వీడిని వాళ్ళకు అప్పగించండి. నమ్మించి మోసం చేసాడు. మనబతుకును ఆగం చేసాడు. మనను అప్పులపాలు చేసాడు." లక్ష్మి అరిచింది భర్తతో ఆవేశంగా ఆమె నోరు నొక్కాడు నర్సింలు. "చంపడం చావడం ఏసమస్యకూ పరిష్కారం కాదు. దెబ్బతిన్న రైతులు ఆవేశంగా ఉన్నారు. వీడు దొరికితే ఏమైనా చేస్తారు. ఆవేశం, ఆవేదన వారి చేత ఏదైనా చేయిస్తుంది. వీడికి ఇద్దరు పిల్లలున్నారు. వారికి తండ్రి లేనిలోటు ఎవరైనా తీరుస్తారా? వీడిని చంపితే బాకీలు తీరుతాయా? వీడు చస్తే మాత్రం పోలీసులు ఊరుకుంటారేంటీ...? కేసులనీ ఇంటరాగేషననీ ఎన్ని కుటుంబాలను విచ్ఛిన్నం చేయరు? ఎందరిని కోర్టుల చుట్టూ తిప్పరు? ఎందరు నేరస్థులుగా మారారు? ఇన్ని చేసినా పోగొట్టుకున్న డబ్బులు తిరిగొస్తాయా? అందరి క్షేమం కోరి మనం ఈ నిర్ణయం తీసుకోకతప్పదు. మన డబ్బు అతడినుండి వసూలు చేసుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి." అంటూ రాజును అటక ఎక్కించాడు నర్సింలు.

అంత దుఃఖంలోనూ భర్తవైపు నిర్ఘాంతపోయి చూస్తుండిపోయింది లక్ష్మి.

ఆ రాత్రే నాలుగు కిలోమీటర్లు తోడుగా వెళ్ళి రాజును బొంబాయి రైలు ఎక్కించి వచ్చాడు నర్సింలు.

*(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం 28-11-1999)*